

# సంధి

పి.వి. కృష్ణారావు
వేములపల్లి మోహనరావు

చివరిసారి గట్టిగా పీల్చి సిగరెట్ పారేశాను. ఊపిరితిత్తుల్లోనుంచిరక్తంలోకి పాకివిషంతో శరీరాన్ని ఉత్తేజంచేసి బలై పోయిన సిగరెట్ తాలూకు దట్టమైన పొగ, యదార్థమైన వర్తమానంనుండి తిరోగమించి, ముడుచుకుని, జీవన వాంఛ నోట్లో పెదాలమీద సుళ్లు తిరుగుతోందా?

మస్తిష్కపు మడతలో యిమిడిన ప్రచండ ఘోషలు, పరిష్కారంలేని సంఘర్షణలు, మనిషిని జయిస్తే ఇలా స్వల్ప సుఖాలే శరణ్యాలవుతాయా!

దేనికిట్లా పొగతో తరచు గుండెను తగలేసుకోవడం! తాత్కాలికమే అయినా, నాకు ఉత్సాహాన్ని కలిగించిన ఆ సిగరెట్‌ను కృతజ్ఞతారహితంగా కిందపడేసి ఆ ఎరుపు నేలపై నీడలో నలుపయ్యే వరకూ చూసి దాని పీక నొక్కాను. కేవలం మనిషికి మాత్రమే చేతనైన చర్య.

ప్రమాదానికి సంకేతమైన ఈ రంగు బస్సుల్లో ప్రయాణిస్తూ మళ్ళీ గాయాన్ని రేపుకోవడానికా నేను బయలుదేరింది! కాదు. కాకూడదు. కనీసం ఈ ఒక్కసారికి, తన హాస్పిటల్ ఓపెనింగ్‌కు తానాహ్వానించిన ఎందరో గొప్పవాళ్ళకంటే నా ప్రెజెన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందనీ, నేను రాకపోతే అది తీరని వెలితి అనీ రామం వ్రాసిన అక్షరాల వెనుక అతని హృదయం ప్రతిబింబించి అందులో అదివరకు నేనంటే తనకున్న అభిమానం, హీరో వర్షిప్ చెక్కుచెదరకుండా వుండటం చూసి, ముగ్ధుణ్ణై, ఎన్నడూ అర్థంకాని నన్ను నేను మరీమరీ శోధించుకుని, అతని ఔన్నత్యానికీ, నా స్థితికీ మధ్య ఉన్న అంతరాన్ని అసూయతో నింపుకోవడం లేదని ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకుని మరీ బయల్దేరాను. అణు ధూమమైన నా గతం, నన్ననుసరిస్తూ ఛాయలా వర్తమానం మీదనుంచీ భవిష్యత్తులోకి కమ్ముకుంటూ, చదివిన పుస్తకాలూ, సంపాదించుకున్న భావసంపదా, ఆధ్యాత్మీకరణకు అందక వక్రీకరిస్తే గతం తాలూకు నీలి నీడలు క్షమార్హుణ్ణి చేస్తాయా! అయినా.... ఎవరు నన్ను క్షమించాలి. నా ఈ పరిస్థితికి, లక్ష్యం లేని నా అన్వేషణకు అంతంలేని ఈ అర్థరహిత ప్రయాణాలకు కారణం ఎవరు! కారణం ఎవరైనా అనుభవిస్తున్నది నేను. క్షమించుకోవలసిందీ నన్ను నేనే.

మళ్ళీ రాజ్యలక్ష్మి జ్ఞాపకాలు. వాటితో ముడివడ్డ ఫాంటసీలు, చైతన్య స్రవంతి ఒడ్డుల్ని ఒరుసుకొని ఉధృతంగా ప్రవహిస్తుంటే వర్తమానం మీదకు మళ్ళని దృష్టి గతాన్ని తరుస్తోంది. రాజ్యలక్ష్మి.... రాజ్యలక్ష్మి.... నేను ప్రతీకారం తీర్చుకుంటాను. నా జీవితానికి నువ్వు పెద్ద అవరోధం అయ్యావు. నా ఆశలకూ ఆశయాలకూ అడ్డు నిలిచావు. దూకే సెలయేరును మళ్ళీ పైకిలేవకుండా పాతాళంలోకి తొక్కేసావు. నీ మూలంగా నేను కాలేజీనుంచి డిస్మిస్ కాకపోతే పెద్ద ఆఫీసర్ని.... కనీసం పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని అయివుండేవాణ్ణి. పోనీ అవేవీ అక్కర్లేదు. గతంచేత ఇలా వేటాడబడేవాణ్ణి కాను. అది చాలదూ!

హద్దులేని ఆలోచనలు మనిషిని ప్రలోభ పెడతాయి. ఒకరకమైన, సంయమన రహితమైన అంతరంగంతో,

బ్రతుకులో గెలుపునుకూడా ఓటమిలా భావిస్తూ సాగిపోతున్న నా ఆలోచనా పరంపరలో ఒకే ఒక్క సబ్జెక్ట్....రాజ్యలక్ష్మి. నా బ్రతుకులో ప్రతి మెలికకూ రాజ్యలక్ష్మి కారణం అనుకోవడానికి అలవాటుపడిపోతున్నానా! తన అశక్తతలకూ, తప్పులకూ, పరాజయాలకూ కారణాలు వెతుక్కోకపోతే తనను తాను డిఫెండ్ చేసుకోలేకపోతే ప్రతి మనిషికీ ఈ ప్రపంచం ఓ పెద్ద లూనటిక్ ఎసైలంలా గోచరిస్తుంది. నిజానికి, ఏదో పీడకలలోనుండి ఒక్కసారిగా మేలుకుని, బాహ్య జగత్తుకు భిన్నంగా నేను తచ్చాడుతూ నడవడానికి కారణం తను కాదూ.

తాడూ, బొంగరం ఉండీ, ఇంటికీ హైద్రాబాదుకీ అనవసరంగా తిరిగే నేను, నాఫ్రస్ట్రేషన్‌కీ, వానిటీ, స్త్రీత్వం, డబ్బును విడిచిపెట్టలేని అహం మూర్తీభవించిన రాజ్యలక్ష్మిని తప్ప వేరే కారణాన్ని వెదుక్కోలేను. ఒప్పుకోలేను. కాలేజీనుంచీ ఆడవాళ్ళంటే ఓ రకమైన రివెంజ్ మనస్తత్వం నా కలవాటు కావడానికి కారణం తనే.

ఎలక్ట్రిక్ దీపాలు, తిరిగేమనుష్యులూ, బస్సులూ చీకటిని తరిమి కొట్టడానికి ప్రయత్నిస్తున్నా, నీడల్లోనూ, వెలుగుల పైనా, శబ్దాల అస్పష్టతలో అంధకారం రాజ్యంచేస్తూనే ఉంది.

'ఎక్స్‌క్యూజ్‌మీ. కాస్త తప్పుకోండి.' స్త్రీ గొంతు.

కాళ్ళు వెనక్కు లాక్కుంటూ ఆమె వైపు చూశాను. నా పక్కనే కూర్చుంది. క్షణంలో అవగతమై జీవితాంతం గుర్తుండే సౌందర్యం. ఆడవాళ్ళంటే అసహ్యం నాకు. అందమంటే కాదు.

నా సిగరెట్ పొగ బాలే నర్తకిలా మొగ్గలేసి పాతబడి, పల్చబడి, తీగలా సాగి, అవిడ మొహం మీదనుంచీ విండోదాటి గాలిలోకి... మసక వెలుతురులోకి వ్యాపించి అస్థిత్వాన్నికోల్పోతోంది.

'సారీ. మీ కేమైనా అభ్యంతరమా' సిగరెట్ ఆర్పటానికి ప్రయత్నిస్తూ అన్నాను.

'ఫర్వాలేదు. మావారు కాలుస్తారు.' అందామె చిన్నగా నవ్వుతూ.

'పోనీ బస్ కదిలే వరకూ నేను ఆ పక్కన కూర్చుంటాను' అన్నాను కర్టెసీ చావక.

సీట్లు మారాము. ఈ సంఘటనతో నా కెంతో చొరవనిపించింది. మార్క్ ట్వైన్ కథలోలా ఒకోసారి చిన్న చిన్న విషయాలే జీవనగతుల్ని మార్చేస్తాయి. తన భర్త కాలుస్తారు కాబట్టి నేను కాల్చినా ఫర్వాలేదా! మూమెంటరీగా నాలో ఆయన్ని చూసిందా!

చూపులు తడుముతున్నట్టై ఒక్కసారిగా తల తిప్పాను. అవిడ నా వంకే చూస్తోంది. నా అంచనాల ప్రకారం,

తరతరాలుగా రిఫ్లెక్స్‌లై పోయిన ఇన్‌హిబిషన్స్‌తో కంగారు నటిస్తూ ఆవిడ తల తిప్పుకోలేదు. పైగా నవ్వుతోంది.

'మిమ్మల్నెక్కడో చూశాను' అందామె చూపుల్ని మరికాస్త నొక్కుతూ. ఒక్కసారిగా రాజ్యలక్ష్మి జ్ఞాపకం. పోలికలు లేవుకదా! నిశితంగా చూశాను. బుచ్చిబాబు కలల్లో ప్రాణం పోసుకుని, చండీదాస్‌లో ఎదిగి వచ్చిన ఈ సౌందర్యపు ముద్దని నేనింతకు ముందు ఎరుగుదునా! తను నన్నెరుగునా! నన్నోడి తన్నోడెనా! తన్నోడి నన్నోడెనా!.... ఆలోచనల్లోని ద్రౌపది మాటల్లోకి రాకపోవడం నా శానిటీకి నిదర్శనం. చూసుంటే, తెలిసుంటే మరిచిపోవడమే సరైన మందు.

'ఇట్లా చూడగానే వ్యక్తుల్నిగానీ, పరిసరాలనుగానీ అంతకుముందు చూసినట్టుగా అనుభూతి చెందడాన్ని 'డిజావు' అంటారు. నిజం చెప్పాలంటే ముందు నేనూ అట్లాగే అనుకున్నాను. ఏ సినిమా హాల్లోనో, బస్‌స్టాప్‌లోనో చూసి ఉంటారు. లేదా ఇల్యూషన్ కావచ్చు'

నా అబద్ధాన్ని క్వాలిఫై చేసుకునే ప్రయత్నం అప్రయత్నంగానే చేశాను. నేనూ అట్లాగే అనుకున్నానని అంటే అవిడ ఈజీగా ఫీలవుతుందనా!

'కాదు.... ఏమో.... గుర్తురావడం లేదు'

మనసు పొరల్లోంచీ బయటపడటానికి ఒత్తిడి చాలని, మరుపని అనుకోలేని ఆ స్థితి నాకు అనుభవమే అయినా, నన్నెట్లా తెలిసుంటుందా అని ఆలోచనల్లోపడి మౌనం విసుగై,

ఇప్పుడు 'ఎరుగుదుం కదా ఒకర్ని ఒకరం. అయినా డిజావుకు సరైన ఏ ఒక్క వివరణా లేదు. నిర్దిష్టంగా రూపు దిద్దుకోని ఆలోచనలు. ఊహలు మానసిక ప్రతిమలు..' ఆమె అనుభూతికి సైకికల్ ఎక్స్‌ప్లనేషన్ ఇస్తూ డ్రైవర్ రాకతో ఆపాను.

బస్ కదిలింది. హాండ్‌బాగ్‌లోంచి ఏదో పుస్తకం తీసి చూస్తోందామె. అప్రయత్నంగా చూశాను. డాస్టోవస్కీ, ఈడియట్. ఆ లేత రంగుల్లో ఓ మూల స్కెచ్‌పెన్ రాతలో ఇనీషియల్ తెలీని సీతాలక్ష్మి బి.ఎ. ఉలిక్కిపడ్డాను. రా జ్య ల క్ష్మి.... సీ తా ల క్ష్మి.... ఈ సామ్యమా నాకు తెలిసింది? కాదు. ఈ పేరు విన్నానా! ఎక్కడ! ఎప్పుడు? పేరు పక్కన బి.ఎ. నన్ను వెక్కిరించింది. ఫైనల్ ఇయర్‌లో డిస్‌కంటిన్యూ కాకపోతే నేనూ అయ్యేవాణ్ణే బియ్యేనో, ఎమ్మేనో.

రాజ్యలక్ష్మి....విన్నా.... విన్నా... ఏంచేస్తే పాపముంది!

సైకాలజీ పుస్తకాల్లో క్రమబద్ధంగా ఇమడని మానవసైజపు యదార్థతలకు సారూప్యమైన ఆ పుస్తకం ఆమె

చేతుల్లో కాసేపు పొరల్ని విచ్చుకుని మళ్ళీ మూసుకుంది.

చెయ్యి చాపాను. 'ఆ పుస్తకం ఇలా ఇవ్వండి?'

'చదివిందే. విసుగేస్తోంది.'

సౌందర్యం, నిమ్నోన్నతాల హృదయం అతికినట్టుగా, ఓ స్త్రీ, నీకు బుద్ధిసంపద అతకదు. ఆమె స్పర్శ తాలూకు జ్ఞాపకాల్ని ఈ పుస్తకం నెమరు వేయదు. అయినా చిలిపి ఆలోచన.... అంతర్యపు లోతులకు ప్రతీకలైన ఆ ఎత్తుగుండెలమీద ఆ పుస్తకం ఎన్ని రాత్రుళ్ళు నిద్రపోయిందో.

'మీ రెందాకా వెళ్తున్నారు?'

'తుణుకు.'

'నేనూ అక్కడికే.'

కాసేపు మౌనం. ఆలోచన లేని బ్లాంక్‌నెస్. బస్ శబ్దం. ఒక్కసారిగా పరిసరాల కాన్షస్‌నెస్. ఆమెకు దూరంగా చుట్టూ చీకటి. వర్తమానంలో కేంద్రీకృతమౌతున్న చైతన్యం.

'మీరేం చేస్తుంటారు?' అర్థరహితంగా పెదాల్నించి ఉరికిన మాటలు.

'అది నేనడగవల్సిన ప్రశ్న' అందామె కొంచెంగా నవ్వుతూ. ముకుళించుకుంటున్న పెదాలు. ఆ నోరు ఏదో పేరు తెలీని అడవి పువ్వు. స్వచ్ఛత దాని పరిమళం. సంస్కారం దాని సొగసు. సహజత అస్థిత్వం.

'లెక్చరర్' అన్నాను. ఆమె బి.ఏ. అని తెలియకపోతే నిజం చెప్పేవాణ్ణా?

చలి వేస్తున్నట్టుంది. చెవులమీదగా స్కార్ఫ్ కట్టుకుంది. ఎర్రటి బ్యాక్ గ్రౌండ్‌లో ఆమె మొహం గెస్టాల్ట్.

'విండోగ్లాస్ వెయ్యమంటారా? అన్నట్టు మనం సీట్లు మార్చుకోనేలేదు?'


'వద్దండీ. కొద్దిగా చలి చాలా బావుంటుంది.

బస్ చేస్తున్న డిస్ట్రబెన్స్‌నుంచీ, విసుగ్గా వెలుగు పక్కలకు పడిపోతున్న చీకటి అందంగా ఉంది. మళ్ళీ సిగరెట్.

కొద్దిగా ఒళ్ళుచేసిన ఈ బాపు బొమ్మలో సృష్టిరహస్యాల్ని వెదుక్కునే ఆ అదృష్టవంతుడెవరు? మదమాత్సర్యాలు మచ్చుకైనా అగుపించని ఆ స్త్రీమూర్తి అవయవ సౌష్టవాన్ని అనాచ్ఛాదితంగా ఊహించడానికి నా ఇమేజరీ ఎందుకు సహకరించడంలేదు? రిలీఫ్‌తో కూడిన ఓ రకమైన ఉత్తేజం. అవిజ్ఞాతాకాలనిపించింది. పుష్ బాక్ సీట్లో రిలాక్స్ అయి కూర్చున్న ఆ స్త్రీ పట్ల నా ప్రెజుడిస్ ఇంటిమసీగా మారాలన్పించింది. ధైర్యం చాలదు. బయటకు చూస్తున్నాను, పుస్తకం మూసేసి.

మళ్ళీ నయనాల స్పర్శ.

'మిమ్మల్ని గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను' కొద్దిగా చిలిపితనం, మరింత హుందాతనం, మూర్తీభవించిన సిన్సియారిటీ నన్ను చొరవ తీసుకోనివ్వలేదు.




'నా పేరు మోహన్. ఎక్కడ చూసుంటారు?'

'మిమ్మల్ని బాగా ఎరుగుదును!'

'ఇంపాసిబుల్. పునర్జన్మను మీరు నమ్ముతారా పోనీ?'

'కొద్దిగా చదివాను. మావారికి చాలా ఇంట్రెస్ట్. అయినా ఈ జన్మలోనే మీరు నాకు తెలుసు. బస్ దిగేలోగా చెప్పేస్తాను లెండి!'

ఈ ఆడవాళ్ళకు అస్తమానం భర్తని మాటల్లోకి తీసుకురావడం అలవాటా! భర్త జ్ఞాపకం భద్రతనిస్తుందా!

చెయ్యి అడ్డుపెట్టుకుని సున్నితంగా ఆవలించిందామె. మళ్ళీ అడవిపువ్వు అందం. రంగుల విచిత్ర సమ్మేళనం.

'నిద్రపోతారా! లైటు తీసేస్తాను.'

'వద్దు ఏమైనా మాట్లాడండి.'

'ఏం మాట్లాడను! నా ఎక్స్‌పెక్టేషన్స్‌కి అందడంలేదు మీరు. మీరే ఏదైనా చెప్పండి!'

'నా పట్ల మీ అభిప్రాయం ఏమిటి?'

'క్షమించండి. మన పరిచయం ఇంకా కొన్ని గంటలే. ఇప్పటికి తెలిసింది చెప్పమంటే చెబుతాను. ఎవరూ ఎవర్నీ పూర్తిగా తెలుసుకోలేరు. అది వేరే విషయం అనుకోండి!'

'చెప్పండి,' అందామె.

'మీరు యింటిని, బయట ప్రపంచాన్ని ఒకేలా చూస్తారు. బహుశా జీవితాన్ని మీరు ఎక్స్‌పెక్ట్ చేసినట్టుగానే చూస్తూ వచ్చారు.'

'నన్ను అమాయకురాలు అంటారా?'

'కాదు. అనుభవాలన్నీ అందమైనవి అని మాత్రమే అన్నాను మీకు జీవితం రెండోవైపు తెలీదు.'

'మనల్ని అమాయకులు అనుకోవడాన్ని ఎంజాయ్ చెయ్యాలంటే ఆ మాట మనం ఆరాధించే వ్యక్తులు, కనీసం ఉన్నతంగా భావించే వ్యక్తులు, ఆత్మీయత ఉన్నవాళ్ళు అనాలి.'

'మీరు సైకాలజీ లెక్చరరా?'

'కాదు. కామర్సు.'

'బాగా మాట్లాడతారు!'

'ఇన్స్పిరేషన్ మీరే అంటే, ఏమీ అనుకోరుగా!'

కొంత వెనకాడుతున్నట్టు భావ ప్రకటన. జవాబుగా చిన్న నవ్వు. ముఖస్తుతిని ఎంత నిరసించినా, అది మన ఎప్రీసియేషన్ని ఏ మూలో పొంది తీరుతుంది.

జీవితంలోలా బస్ కుదుపులు, కాన్షస్‌నెస్‌లో కదిలిపోతున్న భావ స్రవంతిలో గతం మళ్ళీ మెదిలింది. రాజ్యలక్ష్మితో అల్లుకుని ఉన్న ఆ గతంలో నా పాత్ర పెద్దగా లేకపోయినా నా దురుసుతనం మూలంగా. ఆమె అభిజాత్యం, అహంకారం కారణాలుగా, ఆమె తండ్రి కాలేజీ కమిటీ ఛైర్మన్ కావడంవల్ల కాలేజీ నాకు ఉద్వాసన చెప్పింది.

'ఏదో చెబుతూ మళ్ళీ ఆలోచనలో పడ్డారు'

నవ్వాను. ఆలోచనా స్రవంతికీ బాహ్య వర్తనకీ ఉన్న వైరుధ్యం ఎక్సిస్టెన్షియల్ హిపోక్రసీ.

'ఏంలేదు. మనం ఒకర్ని ఒకరం, లేదా మీరు నన్ను ఎరిగి వుండటానికి గల పాజిబిలిటీస్ గురించి ఆలోచిస్తున్నాను. రోడ్డుమీద,సిటీబస్సుల్లో, సినిమా హాల్స్‌లో.... ఇట్లా ఎక్కడో ఎప్పుడో అంతే అనిపిస్తోంది.'

'లేదండీ, అయామ్ ష్యూర్. ఐకెన్ టెల్ యూ ఎట్‌లీస్ట్ ది ఎండ్ ఆఫ్ అవర్ జర్నీ. ఓకే!'

దూరంగా చీకటిని కప్పుకున్న చెట్లు కన్పించీ కన్పించకుండా పరుగెడుతున్నాయి. దగ్గరగా బస్ హెడ్‌లైట్ల వెలుతుర్లో చెట్లు మేల్కొని పరుగెత్తడం బావుంది. మెల్లగా నా చేతనాస్రవంతి పల్చనై ఏవో రూపాలు బయటపడుతున్నాయి. ఇమేజరీతో కలగాపులగం అయిన స్ట్రీమ్ ఆఫ్ థాట్‌లో అసోసియేషన్ పోతోంది. ఈ బస్ ప్రయాణంలో ఫోర్‌గ్రౌండ్ అయిన ఈమె డీ రెసిడ్యూ అయ్యి, నా మస్తిష్కపు పొరల్ని ఆవిష్కరించి నా కలల్లో ఈ రాత్రికి దర్శనమిస్తుందా! మెల్లిగా జారిపోతున్నాను, శరీరస్పృహనుంచి, ఉద్దీప్తమైన శబ్దాలనుంచి నిశ్శబ్దంలోకి, నిద్రలోకి. ఎవరో స్త్రీమూర్తి నన్ను గాఢంగా కౌగిట్లోకి తీసుకుంటోంది. శరీరం సడలి,

జీవితంలో వెలితినుంచీ ఏదో నిండుతనం లోకి జారిపోతున్నాను.

అస్పష్టంగా ఎవరిదో స్త్రీ గొంతు.

'నిద్రపోతున్నారా! లైటు తీసేస్తున్నాను.'

టప్ మని వెలుతురు తొలగిన చప్పుడు. గాజుల సవ్వడి.

* * *

ఎక్కడో తెలీదు.... బద్ధకంగా కూర్చున్నాను.... క్రేన్.... క్రేన్‌లో జారుతున్నాను. కింద అగాధం.... చప్పుడు ఎక్కువైంది. కళ్లు విప్పాను, నిద్రలోనుంచీ.... బస్ శబ్దం.

'గుడ్‌మార్నింగ్'

ఆ మొహం.... ఎంత అందం!.... రాత్రి మాట్లాడుతూ నిద్రలోకి జారిపోయాను. ప్రయాణం....రాత్రి.... ఆమె నన్ను ఎరుగుదుననడం.... అంతా ఒక్క క్షణం.

నవ్వుతూ.... 'వెరీగుడ్‌మార్నింగ్. బాగా నిద్రపోయారా' అన్నాను.

'మీ అంత గాఢంగా కాదనుకోండి. కానీ నిద్రపోయాను!'

కొద్దిగా అలిసిన మొహం. నిద్ర విడిచిన ముద్రగా రంగు తగ్గిన వెంట్రుకలు నలుపు జారిపోనీకుండా పట్టుకున్న కనురెప్పలు.... ఈమెను నేను ఎరుగుదునా!.... నిద్ర మంచులా కడిగి విడిచిన ఆ కళ్ళల్లో తేజాన్ని నేను ఎరుగుదునా! చుట్టూ చూశాను. రాత్రి కురిసిన మంచుపై ఉషస్సు ఉత్తేజం. సూర్యుడు చిత్రకారుడై దిద్దుతున్న ప్రకృతి పరిచితమైన చెట్టూచేమల అమరిక రాబోయే ఊరికి సంకేతం.

'చాలా దూరం వచ్చేశాము.'

'అవును. ముందుస్టాప్‌లో బ్రేక్‌ఫాస్ట్ ముగిస్తే లంచ్ టైంకి ఇల్లు చేర వచ్చు.'

బస్ ఆగింది.

'నేను ఈ ఊర్లోనే చదివాను. పక్కనే అలంకార్, కాఫీ బావుంటుంది. రండి' అన్నాను.

మొహం కడుక్కొని వచ్చింది. 'మీ అందానికి దిద్దుబాట్లు, సర్దుబాట్లు అనవసరం. మీరు ఎప్పుడూ బావుంటారు. అనాలని అనిపించక, అనుకున్నాను. నా అనాసక్త ప్రవృత్తిని విచ్ఛిన్నంచేసి గతం కట్టిన గోడల మధ్య ఖైదీలా మగ్గుతున్న నన్ను చేయి పట్టి పైకిలాగి వర్తమానంలో నిలిపిన ఈ అత్యద్భుత శక్తి, వ్యక్తి ఎవరు!.... ఎవరు....

'మావారూ ఇక్కడే చదివారు!'

'మీ రే బ్యాచ్?'

చెప్పాను.

'మావారు మెడిసిన్ చదవడానికి ముందు బి.ఎస్సీ. ఇక్కడే చదివారు. బహుశా మీ బ్యాచ్ అయ్యుంటారు!

'నేను బికాం. మీ వారి పేరు.' భావ పరంపరలా అబద్ధాల్లో కంటిన్యుటీ. ఆలోచనల్లో రాత్రి సంభాషణ.

'సీతారామారావు'

నా ఉలికిపాటు ఆమె గమనించిందా! జీవితంలో ఎలాంటి పదునైన క్షణాలు! రామం. నా డాక్టర్ రామం. తల్లి దండ్రులు పెట్టిన పేరును ముందూ వెనకా నరికేసి మేము ముద్దుగా పిల్చుకున్న రామం. ఉధృతం అయిన అంతరంగ తరంగాలు శరీరాన్ని చీల్చుకుని.... నేను నశించి... నేను సాధించలేని పరిష్కారం నన్నూ, తన్నూ తానూ వెతుక్కొని బయటపడి.... అంతా ఒకే ఒక్క క్షణంలో.

'అవును. అతన్ని నేను ఎరుగుదును. తల వంచుకున్నాను.

'నిజం చెప్పండి. మీ పేరు జగన్ కదూ!'

ప్రతి మనిషీ తన జీవితంలో అత్యద్భుతంగా నటించవలసిన అవసరాలు, సందర్భాలు ఏర్పడుతుంటాయి. అలవాటు లేక ముఖకవళికల్ని మారకుండా ఉంచుకోడం నాకు చాలా కష్టమైంది. అయినా ఏదో స్థిరత్వం. దేటిపైనో వేసుకున్న ముసుగు. ఏదో ముసుగు. నాకు అర్థంకాదు.

'కాదు' అన్నాను, కంట్రోల్ అవుతూ

'మావారి గ్రూప్ ఫోటోలోనూ, ఆల్బంలోనూ చూశాను అతన్ని. మీలాగే ఉన్నట్టు జ్ఞాపకం.'

నవ్వాను. ఇంకా నవ్వగలుగుతున్నందుకు అభినందించుకోలేను.. అది హిస్టీరిక్ స్మైల్.

'నాకు సీతారారామావుతో కొద్దిగా పరిచయం ఉంది. నేను బి.కాం. కావడం వల్ల పరిచయం స్నేహంగా మారలేదు. జగన్ నాకూ తెలుసు!'

'మావారికి అతనంటే ప్రాణం. రేపు మావారి హాస్పిటల్ ఓపినింగ్. జగన్ తప్పకుండా వస్తారు!'

'అలాగా' అన్నాను.

'అతన్ని కాలేజీనుంచి డిబార్ చేశారని మావారు అన్నారు. మీకేమైనా తెలుసా!' ఆమె చూపులు నన్ను నిలువునా చీలుస్తున్నాయి. దేనికోసమో శోధిస్తున్నాయి.

ఇంక అపుకోలేని పరాజయం. గుర్తింపు కోసం, సింపతీ కోసం నా ఆత్మీయుడి భార్య, ఆ ఆరాధ్యమూర్తి ముందు బయటపడిపోతున్నాను.

'పూర్ ఫెలో.... రాజ్యలక్ష్మి అని ఓ అమ్మాయి వుండేది. బి.ఏ. లో అతని క్లాస్‌మేట్. ఆ అమ్మాయి విషయంలో గొడవైంది. విక్టిమ్స్‌లో అతనొకడు. కానీ పాపం అతనికేమీ తెలియదు. అహం, అధికారం ఆమె సొత్తు. అభిమానం, ఆత్మగౌరవం అతని సొమ్ము. రాజీ లేదు రెండిటికీ. ఫలితంగా అతను డిబార్ అయ్యాడు. అపాలజీ అడిగారు. చెబితే సస్పెన్షన్‌తో ఆగిపోయేదే. కానీ ఆ అమ్మాయికి క్షమాపణ చెప్పుకునే కన్నా, ఛిద్రమైపోయిన జీవితానికే అంతిమఘడియల్లో క్షమాపణ చెప్పుకుందామనుకున్నాడతను.'

మనిషి, ఓ అపరిచితురాలిముందు, తనమీద తానే సానుభూతి చూపించుకోవలసివచ్చే క్షణాలు ఎంత దుర్భరమైనవి!

'ఐ పిటీ' అందామె.

ఇద్దరం హోటల్లోంచి బయటకు నడిచాము.

'రాజ్యలక్ష్మి ఇప్పుడెక్కడుందో తెలుసా!'

'తెలీదు' అన్నాను. ఆలోచనల్లో తప్ప ఆమెమీద పగతీర్చుకోలేను. వెదకలేను, క్షమించలేను.మరచిపోలేను. సుఖపడలేను.... అప్పటికి స్పృహలో నా నిర్ణయాన్ని అమలుపరిచే ధైర్యం వచ్చింది.

'చూడండి. నాకు ఇక్కడ అవసరమైన పనివుంది. తణుకునుంచి వచ్చేప్పుడు దిగుదామనుకున్నాను కానీ నిర్ణయం మార్చుకున్నాను. సాయంకాలం తణుకు వస్తాను. ఇఫ్ యూ డోంట్ మైండ్, ఐ విల్ గెట్ డౌన్ హియర్.'

ఆమె మొహంలో నమ్మలేనంత ఆశ్చర్యం. కనుపాపలు పెద్దవై, 'ఇట్సాల్‌రైట్. రేపు హాస్పిటల్ ప్రారంభోత్సవానికి తప్పనిసరిగా రండి. సరిగ్గా నాలుగింటికి. ఇదీ అడ్రెస్' అంది నా వంక పరీక్షగా చూస్తూ, డాక్టర్ రామం విజిటింగ్ కార్డ్ నా కిస్తూ. అందుకుంటుంటే, నా చేతులు తీవ్ర జ్వరంలోలా, కలలోలా విశ్వమంతై వణికాయి.

'థాంక్స్ మేడమ్. థాంక్స్ ఎలాట్. తప్పకుండా వస్తాను. కన్వే మై రిగార్డ్స్ టు ద డాక్టర్.'

'ష్యూర్. మీతో పరిచయం బావుంది. తప్పనిసరిగా రండి. వస్తారుకదూ!'

తల వూపుతూ బ్యాగ్ అందుకుని దిగిపోయాను. బస్‌లోనుంచీ, నా అబద్ధాల్లోనుంచీ, వర్తమానంలోంచీ, ఆమె నుంచీ, వెనక్కి, నన్ను విడవని గతం లోకి, మళ్ళీ ఇంకోసారి ఓడిపోయి. ....

